శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ ఫండ్‌ద్వారా 7.49కోట్లు ఆర్థికసాయం

- పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అండ - మంత్రి ఆనం రామానారాయణరెడ్డి



ఆత్మకూరు, మే 22, ప్రభాతవార్త : పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం అండగా నిలస్తుందని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో 49మంది లబ్ధిదారులకు 44.89లక్షలు విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు.

మంత్రి ఆనం మాట్లాడుతూ వివిధరకాల వ్యాధులకు వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా ఆర్థికసాయంఅందించి అండగా నిలుస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఆత్మకూరు నియోజకవర్గంలోనే 809మంది లబ్ధిదారులకు 7,49,67,338 రూపాయలను అందించి ఆ కుటుంబాలకు తోడుగా నిలిచామని మంత్రి పేర్కొన్నారు. పేదలకు ప్రతి విషయంలోను మంచి చేయాలని ఆలోచనతో తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు రామాలయం

- రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి "ఆనం"

ఆత్మకూరు, మే 22, ప్రభాతవార్త : రాష్ట్రంలోని టిడ్కో కాలనీలకు రోల్ మోడల్‌గా ఆత్మకూరు టిడ్కో కాలనీలో నిర్మాణంలో ఉన్న రామాలయం నిలుస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణం టిడ్కో కాలనీలో నిర్మిస్తున్న శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని అధికారులు, స్థానిక నేతలతో కలిసిమంత్రి ఆనం రామానారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి భజన మందిరాల్లో రాష్ట్రంలోని మొట్టమొదటి ఆలయంగా నిర్మాణం పూర్తి కావస్తున్న ఆత్మకూరు టిడ్కో కాలనీలోని రామాలయాన్ని త్వరలోనే రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణచే ప్రారంభిస్తామని, ఆలయ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా మంత్రి నారాయణ ఆధ్వర్యంలో శ్రీకారం చుదుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 5వేలకు పైగా శ్రీవాణి భజన మందిరాలు ప్రతిపాదించగా వెయ్యికిపైగా ఆలయాలకు నిధులు మంజూరు చేసి పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. 10లక్షల నుంచి 40లక్షల వరకు ఈ పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తున్నా మన్నారు. ఆత్మకూరులో 40లక్షల వ్యయంతో రామాలయ నిర్మాణాన్ని మంజూరు చేయగా ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు 80శాతం పూర్తయినట్లు తెలిపారు.రామాలయ ప్రాంగణంలో 27నక్షత్రాలకు సంబంధించిన పవిత్ర మొక్కలతో ప్రత్యేకంగా "నక్షత్రవనం" ఏర్పాటు చేస్తున్నా మన్నారు. పురాణాల గొప్పతనాన్ని భవిష్యత్ తరాలకు అందించేందుకు ఈకార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక శోభతో ప్రశాంత వాతావరణంతో తీర్చిదిద్దుతామన్నారు. ప్రతి భక్తుడు ఆహ్లాదకర అనుభూతి పొందేలా భివృద్ధి చేస్తామన్నారు. ఆత్మకూరు నమూనాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రామాలయాల నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. పేదలు నివసించే టిడ్కో కాలనీల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా భక్తుల ఆకాంక్షల మేరకు ఆలయాల మంజూరుకు చర్యలు చేపట్టినట్లు గుర్తుచేశారు. హిందూ ధర్మ వైభవం, సనాతన ధర్మ ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావం, ధార్మిక చింతన పెంపొందించడమే లక్ష్యంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాలోనే కోవూరు మండలంలో 91% శాతం రేషన్ పంపిణీ

కోవూరు, మే 22 ప్రభాతవార్త : కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కోవూరు మండలంలోని అన్ని రేషన్ షాపుల డీలర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో నాగ సంతోష్ అనూష మాట్లాడుతూ జిల్లాలోనే కోవూరు మండలంలో 91% శాతం రేషన్ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కోవూరు మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. ఇదేస్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా రేషన్ డీలర్లు 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి రేషన్ షాపు ఎదుట సరుకుల సమాచారం కార్డుదారులకు తెలిసే విధంగా డిస్‌ప్లే ఉండాలన్నారు. ప్రతి రేషన్ డీలర్ ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూ సకాలంలో కార్డుదారులకు సరుకులు అందించాలన్నారు. రేషన్ డీలర్లకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, డిప్యూటీ తహసీల్దార్ బషీర్, రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై ఆర్డీవో సమావేశం



నెల్లూరు అగ్రికల్చర్, మే 22, ప్రభాతవార్త నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎన్ఎస్ అనూష అధ్యక్షతన శుక్రవారం రూరల్ నియోజకవర్గం లోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు విషయాలపై చర్చించారు. స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (ఎస్ఐఆర్) పై ప్రధానంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ వీఓఏ నిర్మలానంద బాబా, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ఎస్కే జమీర్ భాష, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కండలేరులో 40.650 టీయంసీల నీటిమట్టం

రాపూరు, మే 22, ప్రభాతవార్త : మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయానికి 40.650 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జలాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు, హై లెవల్ కెనాల్ ద్వారా 80 క్యూసెక్కులు,కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 730 క్యూసెక్కులు,హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 710 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1570 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

సిఎం స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని పరుగులు పెట్టిద్దాం

- రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి.
- ఖరీఫ్‌కు ముందే సాగునీటి పనులు పూర్తి చేయాలి
- సోమశిల ఉత్తర,దక్షిణ కాలువల పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- ఆత్మకూరు మున్సిపాల్టీ అభివృద్ధికి 36కోట్ల పనులు
- 23 వార్డుల నుంచి 28వార్డులుగా ఆత్మకూరు మున్సిపాల్టీ

ఆత్మకూరు,మే22,ప్రభాతవార్త : రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల పనితీరు విషయంలో నెల్లూరు జిల్లా ముందువరుసలో ఉండడం గర్వకారణమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామానారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో పలు ప్రభుత్వ శాఖలపై మంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

మంత్రి ఆనం మాట్లాడుతూ జిల్లాలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వలన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవుతున్నాయన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ప్రశంసించడం జిల్లా అధికారులందరికీ గర్వకారణమన్నారు. ఈసందర్భంగా జిల్లా అధికారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. సిఎం ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాలో అభివృద్ధిని మరింత హైస్పీడ్ పెంచాలని అధికారులకు మంత్రి పిలుపునిచ్చారు. సాగునీటి అంశాలపై సోమశిల, తెలుగుగంగ, నీటి పారుదల శాఖల పనితీరును సమీక్షించిన మంత్రి ఆనం రామనారాయణరఎడ్డి కాలువల మరమ్మత్తులు కొనసాగుతున్న పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు ముందే అన్ని పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. కొన్ని కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేస్తూ సైక్లోన్ రిలీఫ్, ఎఫ్‌డిఆర్ గ్రాంట్ కింద మంజూరైన పనులను వెంటనే వేగవంతం చేయాలన్నారు.

సోమశిల ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఉత్తర, దక్షిణ కాలువల పనుల్లో ఉన్న ఇబ్బందులను సమీక్షించి వాటిని త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. మైనర్, మీడియం ఇరిగేషన్ కింద 3212 కోట్ల వ్యయంతో 440పనులు మంజూరయ్యాయని, వాటిలో కొన్ని పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా పేర్తిచేయాలని అధికారులకు సూచించారు. తాగునీటి సరఫరా కోసం జలజీవన్ మిషన్ కింద 6588 కోట్లతో 336పనులు మంజూరై అమలులో ఉన్నాయన్నారు. వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిపిడబ్ల్యుఎస్, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకాల కింద ఉన్న స్కీములను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో 36 కోట్లఓ రహదారులు, డ్రైన్లు, అమృత్ పథకం కింద రక్షిత మంచినీటి పథకాల పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులు సమన్వయంతో పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ అభివృద్ధికి పూర్తిస్థాయి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నా మన్నారు. గతంలో ప్రారంభమైన మాస్టర్ ప్లాన్ ప్రక్రియను ఇప్పుడు పూర్తిస్థాయిలో రూపొందించి నోటిఫికేషన్ కూడా పూర్తయిందన్నారు. ఈప్లాన్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పంపించి భవిష్యత్ నిధులను తీసుకురావడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం 23 వార్డులు ఉన్న ఆత్మకూరు మున్సిపాల్టీని 28వార్డులుగా విస్తరించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని వదులు కోకుండా నిధులు సమీకరించి సమగ్రంగా ఆత్మకూరు ను అభివృద్ధి చేయడమే లక్ష్యంమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ

గూడూరు, మే 22, ప్రభాతవార్త విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ సూచించారు. గూడూరు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో పీ.ఎస్.ఆర్ ట్రస్టు సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు విలువైన చేతి గడియారాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం పీ.ఎస్.ఆర్ ట్రస్టు ద్వారా విలువైన బహుమతులు స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది ఈ క్రమంలో భాగంగా గూడూరులోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక అద్వర్యంలో పీ.ఎస్.ఆర్ ట్రస్టు సహకారంతో పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల టాపర్ లుగా నిలిచిన విద్యార్థులకు రెండు వేల రూపాయలు విలువ చేసే చేతి గడియారం,మెమొంటో మరియు జిప్ ఫైలును స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ దేవసేనమ్మ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొణకా దేవసేనమ్మ మాట్లాడుతూ జెవివి వారు మా ట్రస్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి ఫలితాలు సాధించిన పదో తరగతి విద్యార్థులకు చేతి గడియారాలు,మెమొంటోలు, జిప్ ఫైళ్ళు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ విద్యార్థులను చూసి రాబోయే పది విద్యార్థులు కూడా స్ఫూర్తి పొంది మనం కూడా వేదిక మీద బహుమతులు అందుకోవాలనే ఆలోచన రావాలని ఆకాంక్షించారు.విద్యార్థులందరూ ఇష్టపడి చదివి మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని, టాపర్ గా వచ్చిన విద్యార్థులకు విద్యను అందించిన ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలనే ఉద్దేశ్యంతోనే మిమ్మల్ని ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. జెవివి వారు ఈ కార్యక్రమం చేసినంత కాలం మా ట్రస్టు ద్వారా నిరంతరాయంగా సహకరిస్తామని ఆమె వివరించారు. ఇంకా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, సంస్థ ప్రతినిధులు నాగరాజు, రామ్మోహన్, చెంచు నారాయణ, పురుషోత్తమ రావు, రజనీకాంత్, ఆనంద్, సుబ్రమణ్యం, ఇబ్రహీం, ప్రభాకర్, సుబ్బారావు, ముని భాస్కర్, పుల్లంరాజు, ప్రధానోపాధ్యాయులు భారతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి యోగ, ధ్యాన సాధనలో శిక్షణ



నెల్లూరు క్రైమ్, మే 22, ప్రభాతవార్త నిరంతరం విధుల్లో ఒత్తిడి, మానసిక ఆందోళనలు ఎదుర్కొనే పోలీసు సిబ్బంది మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం సాధించడమే లక్ష్యంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా, ధ్యాన సాధన కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వెజెండ్ల ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా హార్ట్ ఫుల్ నెస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎంఎల్ పరమేశ్వరరావు, సెంటర్ కోఆర్డినేటర్ కె.వి. సత్యనారాయలు మాట్లాడుతూ మానవ శరీరంలో గుండె అత్యంత ప్రధానమైన అవయవమని, ఈ ధ్యాన ప్రక్రియ అంతా హృదయం చుట్టూ పరిభ్రమిస్తుందని వివరించారు. నిత్య జీవితంలో యోగా, ధ్యానాన్ని భాగం చేసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరిగి, విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి వారు యోగా సాధన చేశారు. పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ఉపయోగపడే ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు మే 23, 25 తేదీల్లో కూడా కొనసాగుతాయని జిల్లా ఎస్పీ అజిత వెజెండ్ల తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థకు చెందిన సర్టిఫైడ్ ట్రైనర్లతో పాటు దాదాపు 400 మంది పోలీసు సిబ్బంది అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్బి డిఎస్పీ ధీరజ్ వినీల్, సీఐడీ డియస్పి కోటా రెడ్డి ఏసీబీ, మెరైన్ అధికారులు నెల్లూరు త్రీ టౌన్ సీఐ, సైబర్ సీఐ, పీసీఆర్ సీఐ, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఎన్జీవో నాయకులు

నెల్లూరు కలెక్టరేట్, మే 22, ప్రభాతవార్త శుక్రవారం ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లను ఏపీ ఎన్జీవోస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉద్యోగులకు సంబంధించి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని పోవడం జరిగింది. కలెక్టర్ వీలైనంత త్వరలోనే సమస్యల పరిష్కరిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వైషమ్యాలతో వాటర్ ప్లాంట్ మూత

- గత 22 నెలలుగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు
- వర్గ విభేదాలతో వాటర్ ప్లాంట్ నిరుపయోగం
- చోద్యం చూస్తున్న అధికారులు
- జిల్లా కలెక్టర్ గారూ.. మీరైనా పట్టించుకోండి

కోవూరు, మే22 ప్రభాతవార్త గత ప్రభుత్వంలో ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే ఉద్దేశంతో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి నిధుల నుంచి రూ. 5 లక్షలు ఖర్చు పెట్టి గిరిజన కాలనీ ప్రాంతంలో అప్పటి ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే ఈ ప్లాంట్ ప్రారంభించినప్పటి నుంచి ఈ ప్రాంత వాసులకు సురక్షిత మంచినీరు అందుతూనే ఉంది. ఇటీవల ఎన్నికల్లో ప్రభుత్వాలు మారడంతో ఈ ప్లాంట్‌కు రాజకీయ రంగు పడింది. ఇప్పటివరకు ఈ ప్లాంట్‌ను ఒక వైసీపీ నేత పర్యవేక్షిస్తూ ఉన్నారు. ప్రభుత్వాలు మారడంతో రాజకీయ వైషమ్యాల కారణంగా ప్రస్తుత టీడీపీ నేతలు ఆ ప్లాంట్‌ను అర్థాంతరంగా మూసి వేసేలా చర్యలు చేపట్టారు. గత 22 నెలలుగా ఈ ప్రాంత వాసులు బయట ప్రాంతాల నుంచి 10 నుంచి 20 రూపాయలకు కొనుగోలు చేసి వాటర్ క్యాన్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు కోవూరు నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కోవూరు పంచాయతీ పరిధిలోని చెర్లో గాంధీ సంఘం గిరిజన కాలనీ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ ప్రాంత వాసులు గత సంవత్సర కాలం పైగా ఈ వాటర్ ప్లాంట్ నీటికి అలవాటు పడిపోయారు. అయితే గత 22 నెలలకు పైగా ఈ వాటర్ ప్లాంట్ మూత పడడంతో ఈ ప్రాంత వాసులు సురక్షిత మంచినీటి కోసం ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం సంబంధిత అధికారులు కూడా ఈ విషయంలో ఎటువంటి స్పందన చూపకపోవడం ఈ ప్రాంత వాసులను కలిచివేసింది. దీంతో ఇటీవల జరిగిన గ్రామ సభకు వచ్చిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి పలువురు పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తీసుకొచ్చారు. కేవలం వైసీపీకి చెందిన వ్యక్తి ఈ ప్లాంట్‌ను నడుపుతున్నాడనే ఉద్దేశంతో ఈ ప్లాంట్‌ను ఆపడం ఎంతవరకు సబబని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ఎన్నికల వరకే రాజకీయాలు అని ఎన్నికల తర్వాత ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉండాలన్నారు. వెంటనే ఈ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అయినా కూడా ఇంతవరకు ఈ వాటర్ ప్లాంట్ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం.ఇప్పటికైనా సంబంధిత అధికారులుస్పందించి ప్రజలకు సురక్షిత నీరు అందించే ఈవాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించేలాచర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ఫైల్స్ పూర్తి చేయ్యండి

నుడా చైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు కార్పోరేషన్, మే 22 ప్రభాతవార్త : ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఫైల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లోం పెట్టొద్దని సూచించారు. నుడా కార్యాలయంలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మంత్రి పొంగూరు నారాయణ సూచనలు సలహాలతో ఎల్ఆర్ఎస్ విజయవంతమైందని వెల్లడించారు. ఎల్ఆర్ఎస్ పురోగతిపై నిరంతరం మంత్రి నారాయణ సమీక్షలు నిర్వహించారని, తద్వారా అధికారులు అవగాహన కార్యక్రమాలని విస్తృతంగా చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో కొందరు మాత్రం ఎల్ఆర్ఎస్‌ను వినియోగం చేసుకోలేదని తన దృష్టికి వచ్చిందన్నారు. అనుమతులు లేని ప్లాట్స్ కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని అవగాహన కల్పించినా కొందరిలో మార్పు రాలేదన్నారు. ఆశించిన స్థాయిలో ఎల్ఆర్ఎస్ విజయవంతమైందని ఫైల్స్ కూడా క్లియర్ చేసేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. పిఓ హిమబిందు, ఏపిఓ చంద్ర, కుముదిని తదితరులు ఉన్నారు.

నేటినుండి ఆపరేషన్ క్లీన్ స్వీప్

నెల్లూరు కార్పోరేషన్, మే 22 ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పట్టణ పురపాలక శాఖ ఆధ్వర్యంలో శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టనున్నామని అందులో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ నెలరోజులు పాటు పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టనున్నామని కమిషనర్ వై.ఓ.నందన్ తెలిపారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ మాట్లాడారు. నగరపాలక సంస్థపరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం అందించేందుకు డ్రైను కాలువలను అత్యంత పరిశుభ్రంగా నిర్వహించేందుకు బహిరంగ మలమూత్రాల విసర్జనను అరికట్టేందుకు పబ్లిక్ ప్రాంతాలోల పాన్, గుట్కా ఉమ్మితో కూడిన మరకలు తొలగించి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని నెల్లూరును అత్యంత పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు, అన్ని ప్రభుత్వ విభాగాలు, యువతను భాగస్వాములను చేయనున్నామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో చెత్త రహిత నెల్లూరు నగరాన్ని రూపుదిద్దేందుకు చేపడుతున్న ఈకార్యక్రమంలో ప్రజలందరిని భాగస్వామ్యం చేయాలన్నారు. ఆపరేషన్ క్లీన్‌స్వీప్ కార్యక్రమంలో అన్ని డివిజన్ల ప్రజాప్రతినిదులు స్వచ్ఛందంగా పాల్గొని తమ డివిజన్ పరిధిలో పరిశుభ్రతకు దోహదపడాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

: రూరల్ ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

: కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

నెల్లూరు రూరల్, మే 22 ప్రభాతవార్త : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కోరారు. నేటి ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ ప్రజలకు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎమ్మెల్యే కార్యాలయం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందాలని కోరారు.

❖ నిరుద్యోగ యువత భవిష్యత్తుపై యువనేత నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని, రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు.

❖ ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నెల్లూరు మురళి, రూరల్ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు బిల్లుపాటి రవి, ఏఎంసీ డైరెక్టర్ భీమతాటి సుధాకర్, శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కమిటీ సభ్యుడు సింహాద్రి నాయుడు, టిడిపి నాయకులు ఎంసీ సుబ్రహ్మణ్యం, పట్నం అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు ద్వారా పెంచల స్వామికి రూ.84.51.724 రాబడి

రాపూరు, మే 22, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనృసింహ స్వామికి రూ.84.51.724 రాబడి వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డి తెలిపారు.శుక్రవారం స్వామి వారి ఆస్థాన మండపంలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారు, శ్రీ అంజనేయ స్వామి ఆలయాలలోని హుండీలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్ 23 నుండి మే 22 వరకు 30 రోజులకు గాను భక్తులు స్వామి వారి ఆలయాల్లోని హుండీలలో వేసిన కానుకల ద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు మిక్స్డ్ బంగారు ఆబరణాలు 000.060.500 మిల్లీ గ్రాములు, వెండి ఆభరణాలు 001.550.000 మిల్లీ గ్రాములు, విదేశీ కరెన్సి ఆర్మేనియం 5000 లు 1, కూవైట్ 1/2 దినార్ 1, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 5 దుర్హమ్స్ 2, క్యూటర్ 1 రియల్ 1, కూవైట్ 1/4 దినార్ 3, కూవైట్ 1/2 దినార్ 1, కూవైట్ 1 దినార్ 1, కత్తర్ 10 రియాల్స్ 1,యూఎస్ఏ 1 డాలర్ 1, నేపాల్ 5 రూపియా 1, ఆరబ్ ఎనిరెట్స్ 20 దిరామ్స్ 1, 5 దిరామ్స్ 2, సింగపూర్ 5 డాలర్ 1, వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపు పర్యవేక్షణ నిమిత్తం అసిస్టెంట్ కమీషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర్లు హాజరు కాగా ఈ లెక్కింపు కార్యక్రమంలో ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చకులు గుండ్లూరు శశి స్వామి, ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీనారాయణ, పెంచలకోన ఔట్ పోస్టు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసం - 2026 వేసవి సెలవుల శిక్షణ కార్యక్రమాలు

గూడూరు, మే 22, ప్రభాతవార్త : గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు లక్ష్మీనరసింగరావు పేట సెక్టారు, పూలతోట, తూనికల ఆఫీసు, చెన్నై బైపాస్ ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలోని కిశోరి బాల బాలికలకు సిడిపిఒ స్వర్ణ కుమారి ఆదేశాల మేరకు, వేసవి సెలవుల శిక్షణా కార్యక్రమం కిశోరి వికాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక నిర్వహణ అనే అంశం పై బాలబాలికలకు వివరించారు. డబ్బును అర్థంచేసుకోవడం, అవసరాలు, కోరికలు, పొదుపు ఎందుకు, ఎలా? తెలివిగా ఖర్చు చేయడం, డబ్బును సురక్షితంగా నిర్వహించడం, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక ప్రణాళిక, డబ్బు అనేది ఒక సాధనం, లక్ష్య సాధన దానిని తెలివిగా ఉపయోగిస్తూ, ఈ రోజు కొంచెం ఆదా చేయడం వల్ల రేపు చాలా సహాయపడుతుందన్నారు. దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త వహించడం మంచిదన్నారు. ఖర్చు చేసే ముందే ఆలోచించడం మంచిదన్నారు. ఒక చిన్న ప్రణాళిక పెద్ద తేడాను కలిగిస్తుంది. తెలివైన అమ్మాయిలు తమ డబ్బు ఎక్కడికి పోతుందో తెలుసుకోగలరన్నారు. పిగ్గీ బ్యాంకు లేదా పొదుపు ఖాతాను ప్రారంభించాలని తెలియజేసారు. ప్రతి అమ్మాయి, అబ్బాయి వారానికి ఒక నిర్దిష్ట పొదుపు మొత్తాన్ని దాచుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి. హైమవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.ఎన్ కుమారి, అంగన్‌వాడీ ఆయాలు చంద్రమణి, మాలిని, శశి, బాలబాలికలు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త-వైద్యం : 33/11 కేవీ రేబాల వారి వీధి సబ్ స్టేషన్ లోని 11కేవీ తడికల బజార్ ఫీడర్ , 11 కేవీ ఎఫ్‌సీఐ కాలనీ పీడర్స్‌లో మరమ్మత్తుల కారణంగా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు తడికల బజార్, ముకుందపురం, విజయగోపాలపురం, ఇండస్ట్రీస్ ఏరియా, ఆర్ఎస్ఆర్ స్కూల్ చుట్టు పక్కలన, నజీర్ తోట, ఎఫ్‌సీఐ కాలనీ, కృష్ణా నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల జరుగును. 33/11 కేవీ గోమతి నగర్ ఇండోర్ సబ్ స్టేషన్‌లోని 11 కేవీ గోమతి నగర్ ఫీడర్, ఇండోర్ ఫీడర్ నందు మరమ్మత్తుల కారణంగా ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గోమతి నగర్, ఇస్కాన్ సిటీ, మినీ బైపాస్, అన్నమయ్య, సర్కిల్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

నెల్లూరు జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ సహకరించండి

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త-వైద్యం : రాష్ట్ర క్షయ నివారణాధికారి కార్యాలయం ఆదేశాల మేరకు శుక్రవారం నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎస్‌కే ఖాదర్ వల్లి, వారి బృందం నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరక్టర్ రమేష్ గణపతి వారి కార్యాలయంలో ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ అధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్‌హెచ్ఏఐ నెల్లూరు జిల్లాలో అన్ని టోల్ ప్లాజాల్లో ఉన్న ఉద్యోగస్తులు అందరికి క్షయ నివారణ పరీక్షలు అంటే ఛాతి ఎక్స్‌రేలు, కఫం పరీక్షలు చేయాలని దానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగస్తులు అందరూ సహకరించాలని కోరారు. వెంకటాచలం, కావలి, బుచ్చిటోల్ ప్లాజాలో ఉన్న అందరూ ఉద్యోగస్తులకు ఉచితంగా క్షయ నివారణ పరీక్షలు చేయడం జరుగుతుందని, ఒక వేళ క్షయ నిర్ధారణ పరీక్షల్లో పాజిటివ్ వస్తే ఆరు నెలల పాటు టీబీ సంబంధించిన మందులు ఉచితంగా అందజేయబడతాయని తెలిపారు. అంతే కాకుండా ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ గురించి క్లుప్తంగా ప్రాజెక్టు డైరక్టర్‌కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా టీబీ జిల్లా సమన్వయకర్త జి.విజయ్ కుమార్, పీఎండీటీ టీబీ హెచ్ఐవీ సమన్వయకర్త ఈ.శ్రావణ్ కుమార్, పబ్లిక్ ప్రైవేటు మిక్స్ కోఆర్డినేటర్ పి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ వేలం ద్వారా పాత వాహనాల విక్రయం

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త-వైద్యం : జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు చెందిన 25 పాతవాహనాలను ఈ వేలం ద్వారా విక్రయించడం జరుగుతుందని డీఎంఅం డ్‌హెచ్ఓ వి.సుజాత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖండించబడిన వాహనాలను 30.05.2026 న కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ వేలంలో విక్ర యించడం జరుగుతుందని ఆమె తెలిపారు. వివరాలకు ఏపీ ఈ వేలం పోర్టల్ హెచ్‌టీటీపీఎస్ :// కొనుగోలుఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. వేలం యొక్క అన్ని సాధారణ నిబంధనలు, షరతులు వెబ్‌సైట్‌లో అన్ని సవరణలు, సమయం పొడిగింపు, స్పష్టీకరణలు అందుబాటులో ఉన్నా యన్నారు. ఈ వాహనాల వివరాలన్నీ వెబ్‌సైట్‌లో మాత్రమే పొందుపరచబడతాయని తెలిపారు. బిడ్డర్లు తమను తాము అప్‌డేట్ చేసుకోవడానికి క్రమం తప్పకుండా వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియ జేశారు.

ఆటో నుండి పడి మహిళ మృతి

కోవూరు మే 22 ప్రభాతవార్త : కూలి పనులు చేసుకుంటు జీవనం సాగించే కుటుంబంలో ఆటో ప్రమాదం తీరని విషాదాన్ని మిగిల్చింది. కోవూరు మండలం మోడి గుంట గ్రామానికి చెందిన పూండ్ల వసంతమ్మ (50) కూలినాలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తుండేది ఈమేరకు 15 వ తేది మోడే గుంట నుండి ఆటోలో నెల్లూరుకు బయలుదేరింది .తీరా ఆటో చుండుగుంట ప్రాంతానికి వచ్చే సరికి ఆటో గతుకులో పడి అందులో ఉన్న వసంతమ్మ రోడ్డుమీద పడింది,తీవ్రగాయాలపాలైన ఆమెను ఆటోలోనే నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స తరించారు. అక్కడ చికిత్స పొందుతు గురువారం మృతి చెందించి శుక్రవారం పోస్టుమార్టరం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.ఈమెయిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్యాల రావు తెలిపారు.

బహిరంగ మలమూత్ర ప్రదేశాలు శుభ్రం

కావలి, మే 22 ప్రభాతవార్త : ఈనెల 22నుండి జూన్ 20వరకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏరియా వైద్యశాల ప్రధాన కూడళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో బహిరంగ మలమూత్ర ప్రదేశాలను శుభ్రపరచడం జరిగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణాన్ని ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. మీ ఇంటిని ఏ విధంగా శుభ్రంగా ఉంచుకుంటామో అదే విధంగా పరిసర ప్రాంతాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఎండి.ఫిరోజ్, ఎస్ఐ సుమన్, వార్డు ప్రజలు, నాయకులు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

కావలి పురపాలక సంఘ వార్డు సచివాలయాల తనిఖీ

కావలి, మే 22 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎలీషాకుమార్ కావాలి పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డు సచివాలయాలను శుక్రవారం తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలు వార్డు సచివాలయాలను పరిశీలించారు. దంతంవారివీధిలోని 11, పుల్లారెడ్డి నగర్ 13, రైల్వేస్టేషన్ రోడ్డు 21, రైల్వేరోడ్డు 30నెంబర్లగల సచివాలయాల్లో తనిఖీలు సందర్భంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న సేవలు మరియు పరిపాలన అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా కార్యాలయ నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, ప్రజాసేవలో అమలు తీరు, రికార్డుల నిర్వహణ, ఆర్టీఐ సమాచార బోర్డుల ప్రదర్శన, ప్రజలకు అందిస్తున్న సేవలు, నాణ్యత తదితర అంశాలను పరిశీలించడం జరిగింది. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా వేగవంతంగా మరియు సమయపాలనతో అందించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. 28వ వార్డు సచివాలయం తనిఖీ సమయంలో సచివాలయంలో సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడం గమనించి ఆర్డీఓ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన సంబంధిత సిబ్బందికి షోకాస్ నోటీసులు జారీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించడం జరిగింది.

పెంచలకోన బస్సు కోసం భక్తుల అవస్థలు

రాపూరు, మే 22, ప్రభాతవార్త : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు రాపూరు నుండి పెంచలకోన వెల్లేందుకు బస్సులు లేక శనివారం శుక్రవారం సాయంత్రం భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రతి శనివారం స్వామిని దర్శించుకునేందుకు జిల్లా నుండే కాక ఇతర జిల్లాల నుండి కూడా పెద్ద ఎత్తున భక్తులు శుక్రవారం సాయంత్రం నుండే కోనకు వెలుతుంటారు. పైగా ఇప్పుడు బ్రహ్మోత్సవాల అనంతరం నాల్గవ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు పలు ప్రాంతల నుండి కోనకు వేల్లేందుకు రాపూరు డిపోకు చేరుకున్నారు. అయితే ఇక్కడ కోనకు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడ్డారు. దీంతో పెద్ద ఎత్తున భక్తులు బస్టాండ్ బయడ వుండే ఆటోలను మాట్లాడుకోని కోనకు వెల్లారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనకు శుక్రవారం సాయంత్రం నుండి శనివారం వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రాపూరులో అప్రకటిత విద్యుత్ కోతతో అల్లాడుతున్న ప్రజలు

– పట్టించుకోని విద్యుత్ శాఖాధికారులు

రాపూరు, మే 22, ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాపూరులో ఆప్రకటిత విద్యుత్ కోతతో పట్టణంలోని ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రభుత్వం ఒక పక్క ఎటువంటి విద్యుత్ కోతలు లేవు అని చెపుతున్నప్పటికి రాపూరులో మాత్రం పగలు, రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్ పార్మర్ల కేపాసిటి కి మించి అక్కడ వినియోగం వుండటంతో తరచూ ట్రాన్స్‌పార్మర్ల వద్ద ప్యూజులు పోవడం, ట్రిప్ అవడం జరుగుతుంది. అయితే వినియోగానికి అనుకూలంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రోజుకు అనేక మార్లు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద లైన్ ట్రిప్ అవుతుంది. రాత్రి అయితే అసలు కరంటు వుందా లేదా అన్నట్లుగా ఎక్కువ సమయం కరంటు తీసివేస్తున్నారు. ఇదేమిటని కరెంటు ఎప్పుడు వస్తుంది అని కరంటు ఆపీసుకు పోన్ చేస్తే పోన్ లిఫ్ట్ చేసే వారు ఎవ్వరూ వుండరని స్థానికులు వాపోతునాన్నరు. దీనికి తోడు ఎండలు ఎక్కువగా వుండటంతో తీవ్రమైన వేడి గాలులతో అల్లాడుతున్న ప్రజలు రాపూరులో విదిస్తున్న అప్రకిటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి ప్యూజులు వేసేందుకు మండల కేంద్రమైన రాపూరులో కనీసం లైన్‌మేన్ కూడా లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రాపూరులో అప్రకటిత విద్యుత్ కోతల నుండి ప్రజలను కాపాడంతో పాటు, వినియోగానికి తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటిని పెంచి మండల కేంద్రమైన రాపూరుకు లైన్‌మేన్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

మన రాష్ట్రంలో కూడా మద్యంపై నియంత్రణ విధించాలి

కావలి, మే 22 ప్రభాతవార్త : తమిళనాడు రాష్ట్రం తరహాలో మన రాష్ట్రంలో కూడా మద్యంపై నియంత్రణ విధించి మద్యం బానిసలను తగ్గించాలని సామాజిక కార్యకర్త సి.శారద శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడు నూతన ముఖ్యమంత్రి విజయ్ ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు బస్టాండులకు సమీపంలోని 717మద్యం దుకాణాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేసి ప్రజలందరి చేత శభాష్ అనిపుంచుకున్నారన్నారు. 21ఏళ్లకు లోపు వయసు గల వారికి మద్యం అమ్మరాదని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. మద్యషాపులు 10 గంటల తరువాత మూసివేయాలని ఆదేశాలు జారీ చేసే ఆలోచనలో కూడా ఉన్నారన్నారు. మద్యం కొనేందుకు ఆధార్‌కార్డు తప్పనిసరి చేస్తున్నారన్నారు. దీనివల్ల యువత మద్యానికి బానిసలు కాకుండా నియంత్రించవచ్చు అన్నారు. ప్రార్థనాస్థలాలు, బస్టాండు, విద్యాలయాల వద్ద మద్యందుకాణాలు లేకుంటే స్త్రీలు బాలికలు, విద్యార్థులు భద్రతలో ఉంటారన్నారు. మద్యం కోసం తగలేసే డబ్బు ఇంటి పోషనకు ఖర్చు చేస్తారన్నారు. ఎన్ని ఉచిత పథకాలు ఉన్న పేద కుటుంబాలకు ఈ విధానం ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఏపి ప్రభుత్వం కూడా ఇలాంటి మద్యవిదానాన్ని ప్రవేశపెడితే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషి ఫలిస్తుందన్నారు.

ఏడిసి వెంకారెడ్డిపై చర్చలు తీసుకోవాలి

కావలి, మే 22 ప్రభాతవార్త : ఏడిసి 281 వెంకారెడ్డిపై చర్యలు తీసుకోవాలని గత నాలుగు రోజులుగా ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నా యాజమాన్యం కళ్ళుండి చూడలేని విదంగా చెవులుండి వినలేని విధంగా నిద్రావస్థలో ఉన్నదని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు విమర్శించారు. ఎస్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన నిరసన కార్యక్రమాలు నాలుగోరోజుకు చేరుకోవడం జరిగింది. ఏడిసి వెంకారెడ్డి యూనియన్ ప్రతినిధులపై నిప్పులు చెరుగుతూ అసభ్య పదజాలంతో మాట్లాడుతూ అసభ్య పదజాలతో మాట్లాడుతూ వెర్రివేషాలు వేస్తుంటే యాజమాన్యం చూస్తూ ఊరుకున్నదని విమర్శించారు. నాలుగురోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్న కూడా కావలి డిపో యాజమాన్యం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. ఇకనైనా యాజమాన్యం దిగివచ్చి వెంకారెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం ఎస్‌డబ్ల్యుఎప్ ఉపాధ్యక్షుడు టి.రోశయ్య నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు మొహిద్దిన్, గోపల్, అజిత్, కెవి.నారాయణ, సుధాకర్, మల్లికార్జున, ఎస్‌వి రమణయ్యలు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు జగన్‌మోహన్‌రెడ్డికి లేదు



కావలి, మే 22 ప్రభాతవార్త : ప్రజలకు సేవ చేస్తూ తన సొంత ధనాన్ని ప్రజలకు పంచిపెడుతున్న డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను విమర్శించే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి లేదని జనసేన పార్టీ కావలి నియోజకవర్గ అధికార ప్రతినిధి మన్నేపల్లి రుషికేష్ విమర్శించారు. ఆయన శుక్రవారం పట్టణంలోని జర్నలిస్టు క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ చార్టెడ్‌ఫ్లైట్స్‌లో తిరుగుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 10, 15కిలోమీటర్లు కూడా ఫ్లైట్స్‌లో తిరిగి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వ్యక్తి జగన్ కాదా అని ప్రశ్నించారు. మా నాయకుడు పవన్‌కళ్యాన్ సినిమా షూటింగ్స్‌కి వెళ్ళాలన్నా ఆయన సొంత డబ్బులతోనే వెళ్ళాడని పార్టీ కార్యక్రమాలకు వెలితే జనసేన పార్టీనే ఫ్లైట్ చార్జీలు చెల్లిస్తారని నీలా డబ్బులు దుర్వినియోగం చేయలేదని తెలిపారు. తాడేపల్లి నుంచి తెనాలికి వచ్చేందుకు కూడా ఫైట్ వాడిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందని ఎద్దేవా చేశారు.ప్రజలు గొడ్డలిపార్టీకి 11 సీట్లు ఇచ్చిన బుద్ది చెప్పినా ఇంకా సిగ్గు రాలేదా అని ప్రశ్నించారు. మరోసారి పవన్‌కళ్యాణ్‌ను విమర్శించే ముందు వెనుక ఆలోచించుకోని మాట్లాడాలని తెలిపారు. లేనిచో పార్టీ నాయకులు తగిన బుద్ది చెప్పేందుకు సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ పట్టణ ఉపాధ్యక్షులు నాగార్జున, పార్టీ రూరల్ మండల అధ్యక్షులు గుడిపల్లి వెంకయ్య వారాహి రాయలసీమ జోన్ కమిటీ సభ్యులు ఆల, శ్రీనాథ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు మురళీక్రిష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల రైతులకు రెట్టింపు భారంగా మారిన పరిస్థితులు మేతల ధరలు పెరిగి ఇబ్బందులు

– ఇప్పుడు కొనుగోళ్లకు నిరాకరిస్తున్న దళారులు, ప్రాసెసింగ్ ప్లాంట్లు

తోటపల్లి గూడూరు, మే 22, ప్రభాతవార్త: మండలంలోని ఆక్వా రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఇప్పటికే రొయ్యల మేతలు, మందులు, విద్యుత్ ఖర్చులు భారీగా పెరిగి నష్టాల్లో ఉన్న రైతులకు ఇప్పుడు దళారులు, ప్రాసెసింగ్ ప్లాంట్లు మరో పెద్ద సమస్యగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యలు పూర్తిగా పెరిగి అమ్మకానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, కొనుగోలుదారులు సరైన ధర ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. పదో తేదీ నాటికి 100 కౌంట్ రొయ్యలకు కేజీకి సుమారు రూ.270 వరకు ధర ఉండగా, ప్రస్తుతం అదే రొయ్యలకు రూ.230 మాత్రమే చెబుతున్నారని రైతులు తెలిపారు. కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే కేజీకి రూ.40 వరకు ధర తగ్గించడం వల్ల లక్షల రూపాయల నష్టం వస్తోందని వాపోతున్నారు. అంతేకాకుండా మూడు టన్నుల కంటే తక్కువ సరుకు ఉంటే కొనుగోలు చేయమంటూ దళారులు తిరస్కరిస్తున్నారని, ఇప్పుడు డల్లా పట్టము అంటూ ప్రాసెసింగ్ ప్లాంట్లు కూడా చేతులు ఎత్తేస్తున్నాయని రైతులు చెబుతున్నారు. తోటపల్లి గూడూరు మండలంలో రెండు ప్రధాన ప్రాసెసింగ్ ప్లాంట్లు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి భరోసా లేకుండా పోయిందని వారు అంటున్నారు. రొయ్యలు ఎక్కువ రోజులు చెరువుల్లో ఉంచితే మేత ఖర్చులు మరింత పెరగడంతో పాటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అప్పులు చేసి సాగు చేస్తున్న తమను ప్రాసెసింగ్ యాజమాన్యాలు, దళారులు కలిసి సిండికేట్‌గా మారి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి రైతులకు తగిన న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆక్వా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోళ్లలో పారదర్శకత తీసుకురావాలని, ప్రాసెసింగ్ ప్లాంట్ల వ్యవహారాలపై విచారణ చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోకపోతే ఆక్వా రైతులకు భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశా కార్యకర్త ఝాన్సీ లక్ష్మీబాయి మృతి

– రూ.10వేలు ఆర్థిక సాయం అందజేసిన ఏపీఎన్జీవో అసోసియేషన్

ఇందుకూరుపేట, మే 22, ప్రభాతవార్త : ఇందుకూరుపేట మండలం మైపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముదివర్తిపాలెం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త ఇనమాల ఝాన్సీ లక్ష్మీబాయి(రమ్య) గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. ఆమె గత 15 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తగా స్థానిక ప్రజలకు ఎనలేని సేవలు అంది ంచారు. ఆమె హఠాన్మరణం పట్ల స్థానికులు , తోటి సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని విచా రాన్ని వ్యక్తం చేశారు. ఆమె మృతి పట్ల ఏపీఎన్జీవో అసోసియేషన్ ఇందుకూరుపేట తాలూకా యూనిట్ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఝాన్సీ లక్ష్మీబాయి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తాలూకా యూనిట్ తరుపున తక్షణ సహాయంగా రూ.10వేలు నగదును అందజేశారు. ఈ నగదు వితరణ కార్యక్రమంలో ఏపీఎన్జీవో ఇందుకూరుపేట తాలూకా యూనిట్ అధ్యక్షులు పి.రామిరెడ్డి, సహాధ్యక్షులు డాక్టర్ పి.శ్రావణి పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు. ప్రభుత్వం, శాఖాధికారులు సదరు కుటుంబానికి అండగా నిలవాలని వారు కోరారు.

మీ కోసం నేనున్నా..పేదలకు మంత్రి నారాయణ భరోసా

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త : రాష్ట్ర పుర పాలక పట్టణాభివృద్ది శాఖ మంత్రి డాక్టర్ పొం గూరు నారాయణ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. కొడుకుని కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న పేద కుటుంబానికి చేయూత నందించి పెద్ద కొడుకులా నిలిచాడు. మీ కోసం నేనున్నా అంటూ కొండంత అండగా నిలిచి పేద తల్లిదండ్రుల బతుకుకు భరోసా కల్పించారు. వివ రాల్లోకి వెళ్తే. నెల్లూరు నగరంలోని 3వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్ గిరిజన కాలనీకి చెందిన యాదగిరి నాగేంద్ర (24) అనే యువకుడు రెండు రోజుల క్రితం అకాల మరణం చెందాడు. చేతికందివచ్చిన కొడుకును మృత్యువు కబళించడంతో ఆ నిరుపేద కుటుంబం పుట్టెడు దు:ఖంలో మునిగిపోయింది. కొడుకుని కోల్పోయి, జీవనోపాధి కరువై తల్లడిల్లుతున్న తల్లిదండ్రుల విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. అత్యవసర అధికారిక పనుల నిమిత్తం ఢిల్లీలో ఉన్న మంత్రి నారాయణ సమాచారం అందిన వెంటనే స్పందించి తన పెద్ద మనసును చాటుకున్నారు. ఇంటి పట్టునే ఉండి జీవనోపాధి పొందేందుకు ఇస్త్రీ బండి కావాలని ఆ కుటుంబం కోరిన వెంటనే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే వారికి ఇస్త్రీ బండిని కొనుగోలు చేసి అందజేయాలని నెల్లూరులోని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. మంత్రి నారాయణ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన నాయకులు మామిడాల మధు, ఆదినారాయణరెడ్డి, కొమరి విజయమ్మ, కాకర్ల గోవర్ధన్, కమలాకర్, శైలజ, కృష్ణ, మల్లిఖార్జున, మస్తాన్, తదితరులు బాధిత కుటుంబానికి ఇస్త్రీ బండిని పంపిణీ చేసి ధైర్యం చెప్పారు. ఎక్కడ ఉన్నా నెల్లూరు ప్రజల కష్టాలపైనే మంత్రి నారాయణ దృష్టి ఉంటుందని, పేదల కష్టాలు తీర్చేందుకు ఆయన ఎప్పుడూ ముందుంటారని స్థానిక నాయకులు కొనియాడారు. త్వరలోనే ఆయన స్వయంగా వచ్చి ఆ కుటుంబాన్ని పరామర్శిస్తారని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.

జీవడిని శివత్తాత్వానికే చేర్చే దివ్య చైతన్యం గురువు

కలువాయి మే 22 ప్రభాతవార్త : గురువు అనేది కేవలం ఒక వ్యక్తి కాదు అజ్ఞానాందకారాన్ని తొలగించి జీవుడిని శివతత్వానికే చేర్చే దివ్య చైతన్యమే గురువు అని శివ రాజయోగి కృష్ణస్వామి తెలిపారు. కలువాయిలోని ఉమామహేశ్వరీ కళ్యాణ మండపం నందు శుక్రవారం శివరాజయోగి గురు ప్రాణలింగ దీక్ష ఓం నమః శివాయం మహా ప్రాణోపదేశం మహోత్సవ కార్యాక్రమాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తి శ్రద్దలతో నిర్వహించారు. తెలంగాణా రాష్ట్రం నిర్మల జిల్లాలోని రాజ శ్యామలా పీఠాదిపతి శివరాజయోగి కృష్ణ స్వామి ఈకార్యక్రమంలో పాల్గొని భక్తులకు గురు ప్రాణ లింగ దీక్ష ఇచ్చారు.ఈ సందర్బంగా భక్తులను ఉద్దేశించి స్వామీజి ఉపదేశం చేస్తు శివసాక్షాత్కరం పొందిన యోగి తన అంతరంగ దివ్యశక్తిని పవిత్ర లింగంలో నిక్షిప్తం చేసి శిష్యునికి అనుగ్రహించే అత్యున్నత అధ్యాత్మిక ప్రక్రియనే గురు ప్రాణ లింగ దీక్ష అని తెలిపారు. గురు ప్రాణ లింగ ఆరాధాన వలన మనస్సుకు ప్రశాంతత శరీరానికి ఆరోగ్యం కుటుంబానికి ఐశ్వర్యం జీవితానికి దైవ కృఫ లభిస్తాయని స్వామిజీ వెల్లడించారు.నేటి కలుషిత కాలంలో గురు కృప మాత్రమే మనిషిని ఆధ్యాత్మికంగా రక్షించగలదని గురు భక్తి ద్వారా జీవితం పవిత్ర అవుతుందని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రతి భక్తునికి పవిత్ర గురు ప్రాణ లింగం ,పంచముఖ రుద్రాక్ష ప్రసాదంగా అందజేశారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న భక్తులతో ఓం నమః శివాయం నామస్మరణతో మారు మ్రోగింది.మధ్యాహ్నం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి అన్న ప్రసాద వితరణ అందజేశారు. నిర్వాహకులుఅల్లంపాటి కృష్ణారెడ్డి,డాక్టర్ వెంకట శ్రావణ్, మేకపాటి రమణారెడ్డి,దినేష్,గణేష్, వెంకటకుమార్, శివ భక్త మండలి సభ్యులు పెద్ద సంఖ్యలు భక్తులు పాల్గొన్నారు.

నిడిముసలి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ సేఫ్టీపై శిక్షణ



ఇందుకూరుపేట, మే 22, ప్రభాతవార్త : ఇందుకూరుపేట ప్రాజెక్టు పల్లిపాడు సెక్టార్ పరిధిలోని నిడిముసలి పీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలపై ఫైనాన్షియల్ లిటరసీ, డిజిటల్ సేఫ్టీ అంశాలపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు.ముఖ్య అతిధిగా హాజరైన సెక్టార్ సూపర్‌వైజర్ శిరీష పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణపై పలు కీలక విషయాలను వివరించారు. ఆమె మాట్లాడుతూ డబ్బు ఎలా వస్తుంది, ఎలా ఖర్చవుతుంది అనే విషయాలపై పిల్లలకు అవగాహన ఉండాలని పేర్కొన్నారు. డబ్బు అనేది కేవలం ఏటీఎం మిషన్ల నుండి రాదని, అది అమ్మనాన్నల కష్టారితం అని పిల్లలు గుర్తించాలని హితవు పలికారు. అనవసరపు వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. తమకు లభించే ప్యాకెట్ మనీ(జేబు ఖర్చులు) నుండి ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా కొంత మొత్తాన్ని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ మోసాల పట్ల మొబైల్ భద్రత పట్ల బాలికలు ఎలా అప్రమత్తంగా ఉండాలో డిజిటల్ సేఫ్టీ గురించి వివరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

అనుమసముద్రంపేట,మే22,ప్రభాతవార్త: ఆటో డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏఎస్‌పేట ఎస్ఐ సైదులు హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని పలు కూడళ్ళలో వాహనాల తనిఖీలను నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఓ ఆటోడ్రైవర్ అధిక లోడు ప్యాసింజర్లను ఎక్కించుకొని వెళుతుండగా గమనించిన ఎస్ఐ ఆటోను ఆపి ఆటోడ్రైవర్‌కు పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్‌లు కొద్ది డబ్బుల కోసం అధికమందిని ఎక్కిస్తే ఏమైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని

హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ప్రజలు కూడా గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే ఉద్దేశంతో అధికంగా ఆటోల్లో ఒకరిపై ఒకరు కూర్చొని వెళ్ళరాదని అలా వెళితే బ్యాలెన్స్ తప్పి ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించి నడిపే ఆటోలను సీజ్ చేసి డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

లైన్స్ నగర్‌లో పోలీసు కార్డెన్ సెర్చ్

- 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

దగదర్తి, మే 22, ప్రభాతవార్త : దగదర్తి మండలం లైన్స్ నగర్ కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసు అధికారులు ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. లైన్స్ నగర సమీపంలో ఉన్న కంపెనీలలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చి అద్దె గృహాలలో పని చేస్తున్న వారి నివాసాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు కావలి

రూరల్ సర్కిల్ సీఐ శివవంకర్ తెలిపారు. ఈ సందర్భంగా కావలి రూరల్ సర్కిల్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు కావలి డీఎస్పీ వెంకటరమణ సూచనల మేరకు ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. వాహన యజమానులు సరైన పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. సరైన పత్రాలు లేని వాహనాలను మోటారు చట్టం ప్రకారం అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు. ప్రజలలో అభద్రతాభావాన్ని తొలగించి ప్రజలకు ధైర్యం కొలిపేందుకు ఈ సెర్చ్‌లు నిర్వహిస్తున్నట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి ఎస్సై జంపాని కుమార్, బిట్రగుంట ఎస్సై రామకృష్ణ, అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి, మూడు మండలాల పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బకు ఒకరు మృతి

కోట, మే 22 ప్రభాతవార్త : కోట మండలం గూడలి గ్రామానికి చెందిన ఎల్లసిరి వెంకటేశ్వర్లు (47) అనే వ్యక్తి వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయన విద్యానగర్‌లో గత కొన్నేళ్లుగా ప్రైవేటు కళాశాలలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గురువారం డ్యూటీకి వెళ్లి అనంతరం సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటి వద్ద పడుకున్నాడు. శరీరమంతా చెమటలు పట్టడంతో బంధువులు 108కి సమాచారం ఇచ్చారు. అప్పటికే ఆయన మృతిచెందాడు. కాగా, ఎండల తీవ్రతను తట్టుకోలేక వడదెబ్బకు గురై వెంకటేశ్వర్లు మృతిచెందాడని భార్య, బంధువులు బోరున విలపించారు. ఆ మేరకు విఆర్ఓకి సమాచారం ఇచ్చారు. మృతునికి ఇద్దరు

చిన్నపిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కు మృతిచెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. ఆ కుటుంబానికి ప్రభుత్వం సహాయం చేయాలని బంధువులు, స్థానికులు కోరారు.

చిట్టేడులో బడి పిలుస్తోంది

కోట, మే 22 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఎంఇఒ-1 శిరీష ఆధ్వర్యంలో విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ శిరీష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలల కంటే విద్యాబోధన బాగా జరుగుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాల

ల్లో కల్పిస్తున్న వసతులను తెలియజేశారు. బాలికలు చదువుకోవడం వలన కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరిగిందని వివరించారు.

ఆధార్ అనుసంధానిద్దాం

- తల్లికి వందనం పొందుదాం

కోట, మే 22 ప్రభాతవార్త : కూటమిప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా లబ్ది పొందేందుకు విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాకు ఆధార్ నంబర్ అనుసంధానం తప్పనిసరి. ఆధార్ అనుసంధానం కాక గత ఏడాది కొందరు ఆర్థిక సహాయానికి దూరమయ్యారు. వారంతా అప్పట్లో ఆధార్ కేంద్రాలు, బ్యాంకు చుట్టూ ప్రదక్షణలు చేశారు. 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తుంది. తల్లులకు రూ.13 వేలు, పాఠశాల అభివృద్ధికి రూ.2 వేలు చొప్పున మొత్తం రూ.15 వేలు జమ చేస్తుంది. 2026-27 విద్యా సంవత్సరానికి లబ్ధి పొందనున్న జిల్లాలోని అర్హుత జాబితాలను ఉపాధ్యాయులు సిద్ధం చేస్తున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానమైందో లేదో సరిచూసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉపాధ్యాయుల ద్వారా తల్లిదండ్రులకు ఈ సమాచారాన్ని చేరవేస్తున్నారు. గతంలో కొంతమంది ఆధార్ అనుసంధానం చేసినా సాంకేతిక లోపాలతో ఖాతాలకు డబ్బులు జమ కాలేదు. బ్యాంకు ఖాతాలను పరిశీలించాలి పథకానికి అర్హులైన వారు బ్యాంకు ఖాతా ఉన్న శాఖలో సంప్రదించి దాని మనుగడను పరిశీలించాలి. ఏదయినా సమస్యలుంటే సంబంధిత ఫారాలు తీసుకుని వాటిని అప్‌డేట్ చేసుకోవాలి. అందులో అవసరమైన ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలు, చరవాణి నంబర్‌తో పాటు అవసరమైన సమాచారాన్ని నమోదు చేయాలి. ఎన్‌పిసిఐకు ఖాతా అనుసంధానమైన వెంటనే సెల్‌ఫోన్‌కి సంక్షిప్త సమాచారం వస్తుంది. ఇలా తెలుసుకోవచ్చుప్రభుత్వం అర్హుల జాబితా ప్రకటించిన తర్వాత లింక్ వస్తుంది. సచివాలయ సిబ్బందిని సంప్రదించి మై ఆధార్ సెక్షన్‌కు వెళ్లి ఆధార్ సర్వీస్ కింద చెక్ ఆధార్, బ్యాంక్ లింకేజిని స్టేటస్‌ను ఎంపిక చేసుకోవాలి. ఆధార్ సంఖ్య క్యాప్చాను నమోదు చేయాలి. సెండ్ ఓటిపిపై క్లిక్ చేస్తే సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. అది నమోదు చేయగానే స్క్రీన్‌పై ఆధార్ ఏ బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉందో తెలుస్తుంది.

బండగానిపల్లి పంచాయతీలో యూరియా వాడకంపై సదస్సు

ఉదయగిరి, మే 22, ప్రభాతవార్త : ఉదయగిరి మండల పరిధిలోని బండగానిపల్లి పంచాయతీలో జి.అయ్యవారిపల్లి జి.చెరువుపల్లి జి.చెర్లోపల్లి గ్రామాలలోని రైతులకు యూరియా వాడకంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో విజయభాస్కర్ మాట్లాడుతూ దట్టిమాత బచావో కార్యక్రమం కింద యూరియా అధికా మోతాదులో వాడవద్దని వాడితే అనర్థాలని ఆయన

తెలియజేశారు. యూరియా తక్కువ ధర అని వాడితే పంటలు క్యాన్సర్ భారిన పడే అవకాశం ఉందన్నారు. పంటను బట్టి ఎంత మోతాదులో యూరియా వాడాలో తెలియజేశారు. రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ ద్వారా శిక్షణ కార్యక్రమం

మనుబోలు మే 22 ప్రభాతవార్త :మనుబోలు మండలంలో స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్‌లో భాగంగా మూడురోజుల పాటు పంచాయితీ కార్యదర్శులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ జలజాక్షి తెలిపారు. ఇంద ఎలో భాగంగా శునరకవారం మనుబోలులోని చెత్త సంపద కేంద్రంలో పంచాయితీ డెవలప్‌మెంట్ ఆఎసర్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. తడి చెత్త పొడి చెత్త ఎలా సేకరిం చాలి. సేకరించిన చెత్తను ఎలా వర్గీకరించాలి అన్నదానిపై క్షుణ్ణం

గా వారికి శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో చెత్తా చెదరాలు లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఒ గరుడయ్య, శ్రీనివాసులు,పంచాయితీ కార్యదర్శిలు శ్రీహరి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోను సన్మానించిన డీలర్లు

కోవూరు, మే22 ప్రభాతవార్త : కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన డీలర్ల సమావేశానికి నెల్లూరు ఆర్డీవో అనూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవోను రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, కోవూరు మండల అధ్యక్షుడు మల్లి కార్జునరావు, తదితరులు శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. మండలం లోని అన్ని చౌక డిపోలకు సంబంధించిన డీలర్లు పాల్గొన్నారు.

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

సీతారామపురం మే 22 ప్రభాతవార్త : బడిపిలుస్తోంది ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతారామపురం మండలంలోని గుండుపల్లి గ్రామంలో ఎంఇఒ షేక్ మస్తాన్ వలి ,ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగింది. ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలుసుకొని పిల్లల్ని పాఠశాలకుపంపాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ స్కూల్‌లో వసతులు గురించి టీచర్లు తల్లిదండ్రులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం

వింజమూరు, మే 22, ప్రభాతవార్త : గ్రామీణ భారతంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ ద్వారా సంపూర్ణ పరిశుభ్ర గ్రామాలే లక్ష్యంగా పని చేయాలని ఎంపీడీవో కే. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ పరిధిలోని ఐదవ సచివాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో

కే.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ గ్రామీణ్ కార్యక్రమం రెండు దశల్లో అమలవుతుందని పేర్కొన్నారు. మొదటి దశలో భాగంగా 2019 అక్టోబర్ 2 నాటికి దేశంలో అన్ని గ్రామాలను బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించామని దీని ద్వారా 10 కోట్లు పైగా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయితే ఆరు లక్షలు గ్రామాలు ఓడీఎఫ్‌గా మారాయి అన్నారు. రెండో దశలో 2020-21 నుండి 2024-25 వరకు అమలవుతుందని, దీని లక్ష్యం గ్రామాలను ఓడీఎఫ్ ప్లస్‌గా అంటే సంపూర్ణ పరిశుభ్ర గ్రామాలుగా మార్చడమేనని ఆయన స్పష్టం చేశారు. ఓడీఎఫ్ ప్లస్ గ్రామాల్లో ప్రతి ఇంటితో పాటు పాఠశాలలు పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త నిల్వ నీరు లేకుండా చూడటం ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరిగే విధంగా చర్యలు చేపట్టడం కంపోస్టు ఫిట్స్ సోక్ ఫిట్స్ డ్రైనేజీ వ్యవస్థ కలిగి ఉండేలా ఏర్పాటు, శిక్షణ పొందిన వారు ఇంటింటికి మరుగుదొడ్ల నిర్మాణం వాడకంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు ఘన ద్రవ వ్యర్థాల నిర్వహణ కంపోస్టు సోక్ ఫిట్స్ నిర్మాణం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచి ప్రవర్తనలో మార్పు తీసుకురావడం వంటి అంశాలపై సిబ్బంది పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్‌బీఎం- జి కార్యక్రమం ద్వారా మరుగుదొడ్డి నిర్మాణం కోసం లబ్దిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర నుండి తెలంగాణకు పోయి తిరిగి వచ్చిన చల్లా యానదులకు పునరావాసం

కల్పించాలి దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి

బిట్రగుంట మే 22 ప్రభాతవార్త : అంధ్ర నుండి తెలంగాణకు పోయి తిరిగి వచ్చిన చల్లా యానదులకు పునరావాసం కల్పించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. శుక్రవారం బోగోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాసులు రెడ్డికి వినతిపత్రం అందచేసారు.దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి మాట్లాడుతూ మదు

రోజుల క్రితం నెల్లూరు జిల్లా కు సంబంధించిన 478మంది చల్లా యానాదులు 4 సంవత్సరాల క్రితం ఒక మోసగాడి చెప్పుడు మాటలు విన్నారు. నిజామబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలో 478మంది చల్లా యానాదులను తీసుకెళ్ళి ఇటుక రాళ్ళ బట్టీతయారీ పరిశ్రమలు వద్ద వారిని పెట్టి వారి చుట్టూ రౌడీలను పెట్టి 4సంవత్సరాలు శ్రమ దోచుకున్నారని తెలిపారు. నిజామబాద్లో ఒక ఎన్జిఒ నాయకుడు హైకోర్టుకు విషయం తెలియచేయడంతో తెలంగాణ హైకోర్టు ఆదేశాల ప్రకారం 4బస్సుల్లో కట్టు బాధితులను తీసుకొని నెల్లూరు జిల్లాకు అప్పగించారు. అందుకు సంబంధించి బోగోలు మండలంలో 18మంది దాకా ఉమామహేశ్వరపురంకు చెందిన వారు వున్నారని తెలిపారు. స్థానికంగా వారు లేకపోవడంతో వారి ఇళ్ళను కూడా పలువురు ఆక్రమించుకోవడం, అమ్మివేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం గిరిజన అభివృద్ధి సంస్థ యానాదుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. వారికి ఆధార్ కార్డులు, రేషన్కార్డులు లేవని తెలిపారు. కాబట్టి ప్రభుత్వం స్పందించి వారి నివాస స్థలాలపై విచారణ జరిపించి నీరు, బియ్యం, గ్యాస్, ఇతర వస్తువులు అందించి వారికి పునరావాసం ఏర్పాటు చేయాలని తెలిపారు. 35 కేజీల కార్డు ఇవ్వాలని కోరారు. వారు ఊరిలోకి వెళ్ళి అడ్డుకోకుండా కలెక్టర్ స్పందించి విచారణ చేయాలని తెలిపారు.జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, యానాది మహాసభ నాయకులు ఇండ్ల రవి, గిరిజన నాయకుడు నల్లబోయిన ఇజ్రాయిల్, దుగ్గిరాల భాస్కర్, ఆత్మకూరి తేజ పాల్గొన్నారు.

మండలానికే గర్వకారణంగ నిలిచారు ప్రభుత్వ పాఠశాలల

విద్యార్థులు విద్యార్థుల అభినందన సభలో వక్తలు

జలదంకి,మే22,ప్రభాతవార్త:కార్పోరేట్ పాఠశాలల ప్రకటనలకు ఆకర్షితులై అటువైపు మొగ్గుచూపుతున్న తల్లిదండ్రులను ఆలోచింపజేసి అద్భుత రిజల్ట్ తెచ్చి పెట్టిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మండలానికే గర్వకారణంగ నిలిచారని పలువురు వక్తలు

కొనియాడారు.స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆడిటోరి యంలో శుక్రవారం ఈఏడాది పదవతరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాదించిన ప్రభుత్వం పాఠశాలల విద్యారిని,విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జలదంకి మండలశాఖ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు.ఈసందర్భంగ మండల విద్యాశాఖాదికారి పద్మనాభరావు మాట్లాడుతు మండలంలో ఐదు ఉన్నతపాఠశాలలనుంచి 50 మంది 500కు పైగ మార్కులు సాధించి అటు ఉపాధ్యాయులకు,వారి తల్లి,దండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టారని అన్నారు. 260మంది పరీక్షలకు హాజరైతే అందులో 232 మంది ఉత్తీర్ణులైనారని అంతకంటే గొప్ప విజయం ఇంకేముంటుందని హర్షద్వానాలమధ్య తెలియజేశాడు.ఉత్తీర్ణ తాశాతం కూడ గతంకంటే ఎంతో పెరిగిందని వెల్లడించాడు.ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ధృడ సంకల్ప ఉత్తమ విద్యాభోదపతో విద్యార్థులను తీర్చి దిద్దిన వైనం ఎంత చెప్పిన తక్కువేనని మెచ్చుకున్నాడు.ముఖ్యఅతిదిగ విచ్చేసిన టిడిపి నేత చేవూరి జనార్ధనరెడ్డి మాట్లాడుతు ప్రభుత్వ బడుల పిల్లల్లో ఇంతటి స్కిల్ వుండి మెరవడం చెప్పలేనంత ఆనందంగ వుందని అన్నారు.ఇది గ్రామీణ విద్యార్థులకు ఎంతో స్పూర్తిదాయకమని పేర్కొన్నారు.జలదంకి పూర్వపు విద్యార్థుల సంఘ నేతలు కావలి మోడరన్ టెక్స్‌టైల్స్ అదినేత,స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియ విశ్రాంత ఉద్యోగి హరినారపరెడ్డిలు మాట్లాడుతు మేము ఆసించిన ఫలితాలు సాదించి పాఠశాలకు వన్నె తెచ్చిన ఆణిముత్యాలు వర్షిత్,గౌతమ్‌రెడ్డి,ధీరజ్ కుమార్‌లు మండల ప్రదమ,ద్వితీయ,తృతీయ స్థానాలలో నిలవడం ప్రత్యేకఅభినందనీయులని కొనియా దారు.అనంతరం టాపర్స్‌ని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల పిల్లలను భుజం తట్టి ప్రోత్సహించడంలో కీలక భూమిక పోషిస్తున్న టిడిపి నేత చేవూరి జనార్ధనరెడ్డిని శాలువాలతో సన్మానించడం ప్రత్యేక ఆకర్షణగ నిలిచింది. ఈకార్యక్రమంలోఎంఇఒటు నాగేశ్వరరావు,జలదంకి పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు వింధ్యావళి,జలదంకి ఒఎస్ఎ నేత రావి మాల్యాద్రి,యుటిఎఫ్ నేతలు ,విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్ అండ

విడవలూరు, మే 22 ప్రభాతవార్త : :మండల కేంద్రంలోని సంఘమిత్ర కార్యాలయంలో మహిళల భద్రత కోసం ప్రభుత్వం రూపొందించినశక్తి యాప్పై అవగాహన సమావేశాన్ని స్థానిక ఎంపీడీవో నగేష్ కుమారి, ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో

నిర్వహించారు. అనంతరం యాప్కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో నగేష్ కుమారి మాట్లాడుతూమహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వంశక్తి యాప్ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. మహిళలు తమ మొబైల్ ఫోన్లలో ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకుని అవసరమైన సమయంలో వినియోగించుకోవాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందించేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలకు కూడా యాప్పై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎస్సై నరేష్ మాట్లాడుతూ మహిళలు ఏదైనా ఆపదలో ఉన్న సమయంలో యాప్లోని ఎస్ఓఎస్ బటన్ను నొక్కగానే అమరావతిలోని ప్రధాన నియంత్రణ కేంద్రంతో పాటు సమీప పోలీస్ స్టేషన్కు వెంటనే సమాచారం చేరుతుందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధిత మహిళను వెంటనే సంప్రదించి పరిస్థితిని తెలుసుకుని తక్షణ సహాయం అందిస్తారని వివరించారు. పని ప్రదేశాల్లో గానీ, ఇతర ప్రాంతాల్లో గానీ మహిళలు ఈ యాప్ను వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో విడవలూరు సొసైటీ చైర్మన్ పోన్నలూరు పురంధర్ రెడ్డి,జిల్లా శక్తి టీం, స్థానిక ఏపీఎం వెంకమ్మ, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

గుండాలమ్మ పాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం

కొడవలూరు, మే 22 ప్రభాతవార్త : పేద ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సారథ్యంలోవిపిఆర్ ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా, శుక్రవారం కొడవలూరు మండలం గుండాలమ్మ పాలెం గ్రామంలో విపిఆర్ నేత్ర ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.కోవూరు రైతు సంఘం అధ్యక్షులు పల్లంరెడ్డి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్థుల నుంచి విశేష స్పందన లభించింది. కంటికి రెప్పలా సేవలందిస్తున్న విపిఆర్ ఈ శిబిరంలో భాగంగా వైద్య నిపుణులు గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం దృష్టి లోపంతో బాధపడుతున్న వారికి అక్కడికక్కడే ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చికిత్స పొందిన రోగులు మాట్లాడుతూ.. మనిషి జీవితంలో కళ్లు అత్యంత విలువైనవని, అటువంటి కళ్లకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించి, అద్దాలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం విపిఆర్ ఫౌండేషన్ ద్వారా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. వేమిరెడ్డి దంపతుల సేవా దృక్పథం ఎందరో పేదలకు ఆసరాగా నిలుస్తోందని వారు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గుండాలమ్మ పాలెం సొసైటీ డైరెక్టర్ సాయి మోహన్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు సుజిత్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, విపిఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గడ్డివాముకు నిప్పు.. రైతు కష్టాలు బూడిద!

అర్ధరాత్రి ఆకతాయిల దుశ్చర్య.. రూ.30 వేల నష్టం

విడవలూరు, మే 22 ప్రభాతవార్త: మండలం దంపూరు గ్రామంలో అర్థరాత్రి దారుణ ఘటన చోటుచే సుకుంది. పశువుల మేత కోసం రైతు ఎంతో కష్టపడి నిల్వచేసుకున్న గడ్డివాముకు గుర్తు తెలియని ఆకతాయిలు నిప్పుపెట్టారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్థులు అప్రమత్తమై మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీస్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది.ఈ ఘటనతో బాధిత రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.పశువులపైనే జీవనం ఆధారపడి ఉంది. ఎంతో శ్రమించి పశువుల మేత కోసం నిల్వచేసుకున్న గడ్డి పూర్తిగా కాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది" అని వాపోయాడు. సుమారు రూ.30 వేల వరకు నష్టం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.గడ్డివాముకు నిప్పుపెట్టిన ఘటనపై గ్రామస్తులు, రైతు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై పి. నరేష్ ఆరా తీస్తున్నారు.

పొన్నపూడిలో క్రికెట్ యువత సందడి

విడవలూరు, మే 22 ప్రభాతవార్త: మండలం రామచంద్రపురం పంచాయతీ పొన్నపూడి పెద్ద పాలెం కొత్తూరులో క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్-7ను ఘనంగా ప్రారంభించారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తనయుడు అర్జున్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ టోర్నీని బిజెపి నాయకుడు పొన్నపూడి రమణ తేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకార యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని సూచించారు. యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామ కాపులు, నాయకులు అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని తెలిపారు. టోర్నీలో విజేత జట్టుకు రూ.30,116 నగదు బహుమతిని వేమిరెడ్డి అర్జున్‌రెడ్డి ప్రకటించగా, రన్నరప్‌జట్టుకు రూ.20,116 బహుమతిని పొన్నపూడి రమణ తేజ ప్రకటించారు. కార్యక్రమంలో ఆవుల రవీంద్ర, పెద్దకాపు ఆవుల పోలయ్య, రెండో కాపు వావిలి రాజయ్య, మూడో కాపు కాటంగారి యానాదయ్యతో పాటు మత్స్యకార యువత పాల్గొన్నారు.

డ్రైడే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

కోవూరు, మే22 ప్రభాతవార్త : జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఫ్రైడే నిర్వహించే డ్రైడే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేలా ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎం. సింహాచలం తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎద్దలరేవు సంఘం గిరిజన కాలనీని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంబంధించి లార్వా సర్వే కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో పారదర్శకంగా నిర్వహించేలా ఆరోగ్య సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఇంటిలోని మహిళలు నీటిని నిల్వ ఉంచుకోవడం, టైర్లు వంటివి ఇంటి పరిసరాల్లో ఉంచుకోవడం వలన కీటకజనిత వ్యాధులు సోకే అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి వైద్యాధికారి డాక్టర్ నిరంజన్‌తో సీజనల్ వ్యాధులు, తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో జయరామ్, సబ్ యూనిట్ అధికారి నాగరాజు, పీహెచ్ఎన్ కృష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఐటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధీర్

కోవూరు, మే22 ప్రభాతవార్త : కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన పగడాల సుధీర్‌ను జిల్లా వైసీపీ ఐటీ విభాగం ప్రతి కార్యదర్శిగా నియమిస్తూ ఈ మేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతంకు మరింత కృషి చేస్తానన్నారు.

హెల్మెట్ వాడకంపై మరింత అవగాహన పెంచాలి

కోవూరు, మే22 ప్రభాతవార్త : కోవూరులోని సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సీఐ సుధాకర్‌రెడ్డి ఎస్సైలతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా వాహనాల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్ వాడేలా వారిలో అవగాహన పెంచాలన్నారు. ఇటీవల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కేవలం హెల్మెట్ లేని కారణంగా అనేకమంది మృత్యువాత పడ్డారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ద్విచక్ర వాహనచోదకులు కూడా పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే అర్జీల పరిష్కారంపై ఎస్సైలు ప్రత్యేక దృష్టి సారించి సకాలంలో వాటిని పరిష్కరించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎస్సైల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో ఎస్సైలు ముత్యాలరావు, ఖదిర్‌బాషా, తదితరులు ఉన్నారు.

దాతృత్వం చాటుకున్న కానిస్టేబుల్ రాజ్యం

కావలి, మే 22 ప్రభాతవార్త : కావలి వడ్డెపాలెం నివాసులు మహిళా కానిస్టేబుల్ రాజ్యం శుక్రవారం వారి కుమారుడు వల్లెపు వెంకట్ విశాల్ పుట్టినరోజు సందర్భంగా స్థానిక తుపాన్ నగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకుంటున్న విద్యార్థులకు నోట్‌బుక్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ తమ యొక్క సంస్థ కార్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ చేసిన కానిస్టేబుల్ రాజ్యంకి ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అలాగే పుట్టినరోజు జరుపుకుటున్న వారి కుమారుడు వల్లెపు వెంకటవిశాల్‌కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కుమారుడి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోటుబుక్స్ వితరణ చేసి దాతృత్వం చాటుకున్న కానిస్టేబుల్ రాజ్యంని అభినందించారు.

డంపింగ్ లారీని ప్రారంభించిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా

బుచ్చి మే 22 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలో డంపింగ్ లారీని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమిషనర్ చిన్నబా బుతో కలిసి ప్రారంబించారు. మొదట మురళీ స్వామిపూజా కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మాట్లాడుతు స్వచ్ఛంద్రా,స్వర్ణాంద్రలో భాగంగా కాంప్యాక్టర్ అనే వాహనాన్ని ప్రారంభించడం జరిగింది. ఈవాహనం వల్ల ట్రాక్టర్లు చెత్తను తీసుకొని వచ్చి కాంప్యాక్టర్‌లో వేస్తారు. కోవూరు శాసనసభ్యురాలుకి,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి తెలియ జేయడంతో వారు ఈ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొనివచ్చారు. ఈ వాహనం వల్ల చాలా ఉపయోగం కలుగుతుందని అన్నారు.ప్రతి ట్రాక్టర్ డంపింగ్ యార్డు వద్దకు తీసుకొని వెళ్ళాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఎమ్మేల్యేకి,ఎంపికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.మున్సిఫల్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల మోముల్లో ఆనందం

కోట,మే 22 ప్రభాతవార్త సముద్రాన్ని నమ్ముకొని జీవించే మత్స్యకారులకు ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. మత్స్యకార సేవ సాయం విడుదల చేసిన విషయం తెలిసిందే. చేపల వేట నిషేద సమయంలో కృష్ణాలు పడకుండా సకాలంలో సాయం అందించి వారి ముఖాల్లో ఆనం దాన్ని నింపింది. మండలం కొత్తపట్నం పంచాయతీలోని 232 మందికి సాయం అందింది. మెకనైజడ్‌బోట్లలో రోజూ చేపల వేట సాగిస్తూ ఉపాధి పొందేవారు. కెరటాలతో బతుకు పోరాటం చేసే వీరు ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు 60 రోజుల పాటు చేపల గుడ్లు పెట్టె సమయం కావడంతో వేటకు దూరంగా ఉంటారు. ఈ సమయంలో సాయం కింద అందే రూ.10 వేలను రూ 20 వేలకు పెంచుతామని ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ హామీని నిలబెట్టుకుంటూ వరసాగా రెండో ఏడాది ఒక్కొక్కరికీ రూ 20 వేలు చొప్పున సాయం అందించారు. వీరితో ఈ కేవైసీ చేయించి బ్యాంకు ఖాతల్లోనే నగదు జమ చేసింది. నిషేద సమయంలో ఆర్ధిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మత్స్యకారులకు ప్రభుత్వ సాయం ఉపశమనం కలిగి చింది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సాయం అందేలాజాగ్రత్తలు తీసుకున్నామని మత్స్యకారి అధికారి రెడ్డి నాయక్ తెలిపారు.

యువతలో వేగంగా పెరుగుతున్న మధుమేహం

- ప్రీడయాబెటిస్ హెచ్చరికలను ముందుగానే గుర్తించాలి

- జీవనశైలిలో మార్పులతో మధుమేహాన్ని నివారించవచ్చు : డాక్టర్ రవీంద్రరెడ్డి

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త-వైద్యం ప్రస్తుతం యువతలో మధుమేహం వేగంగా పెరుగుతుండడం ఆందోళనకలిగించే విషయమని,ముఖ్యంగా 25నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారిలో ప్రీడయాబెటిస్ కేసులు అధికంగా కనిపిస్తున్నాయని మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు యూనిట్‌కు చెందిన దయా బెటాలజిస్ట్ డాక్టర్ రవీంద్రరెడ్డి తెలిపారు. అనియంత్రిత ఆహారపు అలవాట్లు శారీరక శ్రమ తగ్గిపోవడం, అధిక ఒత్తిడి, నిద్రలేమి, ఫాస్ట్ ఫుడ్ వినియోగం,ఊబకాయం వంటి కారణాలతో యువతలో మధుమేహం వేగంగా పెరుగుతోందన్నారు. కుటుంబంలో మధుమేహ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ప్రీడయాబెటిస్ దశలోనే గుర్తిస్తే మధుమేహాన్ని పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. తరచుగా దాహం వేయడం, ఎక్కువగా మూత్ర విసర్జన, అలసట, ఆకలి ఎక్కువగా ఉండడం, బరువు మార్పులు, గాయాలు ఆలస్యంగా మానడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రతి సంవత్సరం కనీసం ఒకసారి రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవాలని, రోజుకు కనీసం 30నిమిషాలు వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం,బరువు నియంత్రణలో ఉంచుకోవడంద్వారా మధుమేహాన్ని దూరం పెట్టవచ్చని డాక్టర్ రవీంద్రరెడ్డి తెలిపారు. యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి జీవనశైలిలో మార్పులు చేసుకుంటే భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్యసమస్యలను నివారించవచ్చున్నారు.

ఎరువుల యాజమాన్యంపై రైతుల్లో అవగాహన పెంచాలి

కోవూరు, మే22 ప్రభాతవార్త : కోవూరులోని సహాయ వ్యవసాయ సంచాలకులు కార్యాలయంలో శుక్రవారం కోవూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన వ్యవసాయాధికారులు, విస్తరణాధికా రులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ దృష్టిలో పెట్టుకుని ఎరువుల యాజమాన్యం పద్దతులపై రైతుల్లో మరింత అవగాహన పెంచేలా సంబంధిత మండల వ్యవసాయాధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. వరి సాగుకు సంబంధించి యూరియాను ఎకరాకు 3 బస్తాలు చొప్పున వాడేలా రైతులకు విశదీకరించాలన్నారు. ముఖ్యంగా యూరియాను కార్డుల ద్వారానే రైతులకు అందజేయాలన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా 3,4కోటాలో నానో యూరియాను వాడుకునేలా వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన పెంచాలన్నారు. ప్రతి రైతుకు సంబంధించిన ఏపీఏఐఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ ఖరీఫ్‌కు సంబంధించి వరినాట్లు వేసేవారు డ్రమ్‌సీడర్ విధానం ద్వారా నాట్లు వేస్తే రైతులకు ఖర్చులు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి రైతు నారు పీకే నాలుగు రోజులకు ముందుగానే నానో యూరియాను పిచికారి చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ సమీక్షలో ఐదు మండలాల వ్యవసాయాధికారులు ఉన్నారు.

నాలుగు నెలలుగా జీతాలు లేవు

- ఇబ్బందుల్లో పారిశుధ్య కార్మికులు

కోవూరు, మే22 ప్రభాతవార్త : కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పారిశుధ్య కార్మికులకు పూట గడవడమే కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు పంచాయతీ ఖాతాలో పుష్కలంగా నిధులు ఉన్నా వాటిని డ్రా చేసే పరిస్థితి లేకపోవడంతో పంచాయతీ ప్రత్యేక అధికారులు కూడా ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికే జీతాలు రాక కుటుంబ పరిస్థితి గడవక అప్పులు తెచ్చి మరీ పారిశుధ్య కార్మికులు కుటుంబాన్ని సాగదీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్ని పంచాయతీల్లో జీతాలు ఇవ్వకపోవడంతో విధులకు డుమ్మ కొట్టి పొలం పనులకు వెళ్లాల్సిన పరిస్థితి. ఒకవైపు ప్రభుత్వం ప్రతిరోజూ పంచాయతీలో ఏదొక కార్యక్రమం చేయాలని ఆదేశాలు ఇస్తున్నా వాటిని అమలు చేసేందుకు నిధులు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. సొంత నిధులు పెట్టి ఎంతకాలం ఈ పని చేయాలని పలువురు కార్యదర్శులు వాపోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించేలా చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై కోవూరు పంచాయతీ ప్రత్యేకాధికారి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులును వివరణ కోరగా.. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి జీతాలు ఆన్‌లైన్‌లో పెట్టి ఉన్నామని, తెలికపాటి ఎర్రర్ కారణంగా వాటిని పరిశీలించి పంపేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ఒక్క ఫోన్ కాల్ చేయండి

ప్రతి సమస్యకు స్పందిస్తా : ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు రూరల్ మే 22, ప్రభాతవార్త : ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డితెలిపారు. నేడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ., ఈ.ఈ., ఏ.ఈ.లతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఇటీవల కొండాయపాలెం ప్రాంతంలో ఏర్పడిన కరెంటు అంతరాయం సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, ఓవర్లోడ్ కారణంగానే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ సరఫరాను మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో కొత్త సబ్ స్టేషన్లు, అదనపు ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ఎమ్మెల్యే వెల్లడించారు. వెంగళరావు నగర్,హరనాథపురం ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల ఏర్పాటుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో గ్రామాల్లో ఇప్పటికే 3 ఫేజ్ కరెంటు పనులను పకడ్బందీగా పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు ఎప్పుడైనా ఏ సమస్య వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయాలని, ప్రతి ఫోన్ కాల్కు స్పందిస్తానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హామీ ఇచ్చారు.

ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చినా అధికారులలో చలనం లేదు..

.హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేసిన అధికారులపై కంటెంప్ ఆఫ్ కోర్టుకు వెల్లా

బిసి భవన్ అధ్యక్షులు ద్రోణాదల వెంకట్రావు

కావలి, మే 22 ప్రభాతవార్త : కావలి పట్టణంలో వరవ కాలువస్థలాలను ఆక్రమించి కోట్ల రుపాయల ఆస్తులను కూడబెట్టిన వారిపై చర్యలు తీసుకఠ వాలని హైకోర్టు ఆదేశించిన అధికారుల్లో మాత్రం చలనం లేదని కావలి బీసీ భవన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ద్రోణాదుల వెంకట్రావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ పట్టణంలో గత కొద్ది సంవత్సరాల క్రితం వరవ కాలువ స్థలాన్ని ఆక్రమించి షాపులు, బిల్డింగులు కట్టుకొని కోట్ల రుపాయల ఆస్థులను కూడా పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని 2012వ సంవత్సరంలో ప్రజావేదిక తరపున శేషయ్య నాయుడు అనే వ్యక్తి క్రిష్ణమూర్తి అనే అడ్వకేట్ ద్వారా హైకోర్టులో ఫీల్ వేయటం జరిగిందన్నారు. అయితే దీనిపై 2026లో హైకోర్టు అర్‌అండ్‌బి ఇరిగేషన్, రెవెన్యూ మున్సిపల్ శాఖల అధికారులకు తక్షణమే వరవ కాలువకు సంబందించిన స్థలంలో ఉన్న షాపులను, భవనాలను తొలగించాలని ఆదేశాలే ఇవ్వడం జరిగిందనానడ్రు. దీనిపై అధికారులు చర్యలు తీసుకునేందుకు ఎందుకు వెనకాడుతున్నారో తెలియడం లేదని తెలిపారు. దీని వెనక ఎన్నికోట్ల రుపాయలు, లక్ష రుపాయలు చేతులు మారాయో అర్థం కావటం లేదన్నారు. ఈ విషయంపై బీసీ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించడం జరిగిందన్నారు. ఈ వరవ కాలవ ఆక్రమణల్లో 90శాతం మంది ధనికులే కానీ పేదలు లేరన్నారు. అలానే వీటిపై ప్రశ్నించాల్సిన విపక్ష ప్రతిపక్షాలు కూడా మౌనం వహించడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఇంప్లిమెంట్ చేయడంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో తెలియడం లేదన్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే సంబంధించిన అధికారులపై కంటెంప్ట్‌ఆఫ్ కోర్టుకు వెళ్ళేందుకు సిద్దంగా ఉన్నట్లు ఆయన తెలియజేశారు.

నెల్లూరు రూరల్లో అభివృద్ధి జోరు

85 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం

నెల్లూరు రూరల్ మే22,ప్రభాతవార్త నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతు న్నాయి.కలివెలపాలెం, పెనుబర్తి గ్రామాల్లో సుమారు రూ.85 లక్షల విలువైన అభివృద్ధి పనులను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు బూడిద విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువనేత నారా లోకేష్ ఆశీస్సులతో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు జరుగు తున్నాయని తెలిపారు. రూరల్ ప్రాంతంలో అభివృద్ధి ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగుతోందని, గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు పల్లంరెడ్డి రవీంధ్ర రెడ్డి, శితిదిళీ చైర్మెన్ చెన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, టిడిపి నాయకులు వెడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు,దేవస్థానం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, వేమిరెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు కార్పొరేషన్ అకౌంటెంట్‌గా ఏవి.సులోచన

నెల్లూరు కార్పోరేషన్, మే 22 ప్రభాతవార్త : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ.నందన్ కార్యాల యం పబ్లిక్ హెల్త్ విభాగం సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏవి.సులోచనను అకౌంటెంట్‌గాను, రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసులను పబ్లిక్ హెల్‌త సెక్షన్ సూపరిం టెండెంట్‌గానూ బదిలీచేస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీచేశారు. పి.శ్రీనివాసులను ఇన్‌చార్జ్ రెవెన్యూ అధికారిగా కొనసాగిస్తున్నట్లు కూడా ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ మేరకు కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్ నుంచి ఆమె ఉత్తర్వులను అందుకొన్నారు.

ముత్యాలపాడు ఏఎంసీ మార్కెట్ యార్డ్ వద్ద పోలీసుల పటిష్ట నిఘా..డ్రోన్లతో పర్యవేక్షణ

చిల్లకూరు, మే 22, ప్రభాతవార్త గూడూరు నియోజకవర్గం పరిధిలోని చిల్లకూరు మండలం ముత్యాలపాడు ఏఎంసీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద శాంతిభద్రతల పరిరక్షణ, రద్దీ నియంత్రణ మరియు ప్రజల భద్రతను పర్యవేక్షించడానికి ఎస్సై సురేష్ బాబు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలతో నిఘా.. పోలీస్ పికెట్ ఏర్పాటు ప్రతి వారం ఇక్కడ జరిగే వ్యాపార లావాదేవీలను దృష్టిలో ఉం చుకుని, మార్కెట్ ప్రాంగణంలో ఎ లాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా అక్కడ ఒక పోలీస్ పికెట్ ను మోహరించారు. దీనితో పాటు, మా ర్కెట్ పరిసరాల్లో ప్రజల కదలికలను నిరంతరం గమనించడానికి మరియు రద్దీని నియంత్రించడానికి అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా వైమానిక నిఘా నిర్వహిస్తూ భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

- శుక్రవారం గొర్రెల సంతతో భారీ రద్దీ ముత్యాలపాడు మార్కెట్ యార్డ్‌లో ప్రతి శుక్రవారం గొర్రెల సంత నిర్వహిస్తారు. ఈ సంతకు వివిధ ప్రాంతాల నుండి వందలాది మంది వ్యాపారులు, రైతులు తమ గొర్రెలను విక్రయించడానికి మరియు కొనుగోలు చేయడానికి భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలోనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, దొంగతనాలు లేదా ఘర్షణలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ఈ పటిష్ట నిఘా చర్యలు చేపట్టారు.

ముఠా వర్కర్స్ కూలి రేట్లు పెంచాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్

గూడూరు, మే 22, ప్రభాతవార్త ముఠా వర్కర్స్ కూలి రేట్లు పెంచాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ముఠా వర్కర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ నెల నెలా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం కూలి రెట్లు సరిపోవడం లేదన్నారు. ముఖ్యంగా కూరగాయలు, గ్యాస్, ఇంటి అద్దె, కరెంట్ బిల్లు, విద్యార్థుల స్కూల్ ఫీజులు, ఆసుపత్రి ఖర్చులు గణనీయంగా పెరగడంతో జీవన వ్యయం భారీగా పెరిగిందని, కానీ కూలి రెట్లు మాత్రం పెరగలేదన్నారు. గత 12 ఏళ్లుగా ముఠా వర్కర్స్ చాలీచాలని కూలీ రేట్లతో జీవనం గడుపుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్ అసోసియేషన్ లు వారి శ్రమని దోపిడి చేస్తున్నారు తప్ప, పనికి తగిన కూలీలు ఇవ్వడం లేదన్నారు. ఇకనైనా వారి శ్రమను గుర్తించి కూలి రేట్లను పెంచాలన్నారు. ముఠా వర్కర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం గూడూరు ముఠా వర్కర్స్ నూతన సమితిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొబ్బిలి మునిశేఖర్, కార్యదర్శిగా బండి పాపయ్య, ఉపాధ్యక్షులుగా మనుబోలు గోపి, సహాయ కార్యదర్శి మల్లి పెంచలయ్య, కోశాధికారి బండి కృష్ణను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గూడూరు పట్టణ కన్వీనర్ సునీల్, ముఠా వర్కర్స్ నాయకులు వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అలర్ట్ దరఖాస్తు గడువు పెంపు

ఉదయగిరి, మే 22, ప్రభాతవార్త మండల కేంద్రమైన ఉదయగిరి ఇన్‌చార్జి ఏడీఏ శుక్రవారం ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయితీపై అందించే వ్యవ సాయ యంత్ర పరికరాలు కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 26వరకు పెంచినట్లు ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి తెలిపారు. రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, స్ప్రెయర్లు, పవర్ టిల్లర్లు, పంట నూర్పిడి యంత్రాలు మినీ ట్రాక్టర్లు, తవ్వే యంత్రాలు, గడ్డి కట్టే యంత్రాలు అందిస్తా రన్నారు. మరిన్ని వివరాలకు సమీపంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఉదయగిరి నియోజకవర్గంలో బీసీలకు సముచిత స్థానం కాకర్ల వల్లే సాధ్యం

ఉదయగిరి, మే 22, ప్రభాతవార్త ఉదయగిరి నియోజకవర్గంలోని బీసీలకు సముచిత స్థానం కల్పించడంలోనూ ప్రేమానురాగాలు చూపడంలోనూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అదే విధంగా ఉదయగిరి నియోజకవర్గంలో కష్టం వచ్చింది అని ఫోన్ చేసిన ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా ఆర్థిక సహాయం అందించడంలో ముందుండే వ్యక్తి ఎవరు అంటే మన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తరువాత ఫోన్ చేసి యోగక్షేమాలు అడగటంలో అదే విధంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల విషయంలోనూ ఎటువంటి జాప్యం లేకుండా చూసుకునే వ్యక్తి మన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అని టీడీపీ జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి కంచర్ల శ్రీనివాసులు అన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఉండేటువంటి బీసీలందరితోనూ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఐక్యతగా ఉంటూ వారు చేపడుతున్నటువంటి ప్రతి పనికి తోడు నీడగా నిలుస్తున్నారని అటువంటి శాసనసభ్యులపై ఎవరో వ్యక్తి మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఉదయగిరి తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్‌గా బయన్న యాదవ్ బీసీ కాదా, సీతారామపురం సొసైటీ అధ్యక్షులు సోమనబోయిన రాజశేఖర్‌లు బీసీలు కాదా, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంజాం రాఘవేంద్రం బీసీ కాదా, తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి మద్దసాని వెంకటేశ్వర్లు బీసీ కాదా, ఏఎంసీ ఉపాధ్యక్షులుగా ప్రతిపాదించిన చీమల తాతయ్య బీసీ కాదా, నెల్లూరు జిల్లా పార్లమెంట్‌కార్యదర్శిగా ఉన్న నేను బీసీని కాదా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది అనేక కీలక పదవులలో బీసీ నాయకులను నియమించడం ద్వారా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బీసీలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారన్నారు. నియోజకవర్గంలోని సంపదను కాపాడడంలో మన శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఎంత కఠినంగా వ్యవహరిస్తారో నియోజకవర్గంలో ప్రతి ఒక్క పౌరునికి తెలుసు. ఎవరో స్క్రిప్ట్ రాసిచ్చి నీ చేత పలికిస్తే ఆ పలుకులను మీడియా ముందు మాట్లాడటం ఎమ్మెల్యేను, పార్టీను వీధుల్లోకి తీసుకురావడం ద్వారా పార్టీ పట్ల నీకున్న నిబద్దత ఎంతో తెలుస్తోంది. నియోజకవర్గంలోని బీసీ సీనియర్ నాయకులైన పొన్నెబోయిన చెందాల బాబు యాదవ్(మాజీ జిల్లా పరిషత్ చైర్మన్), చల్లా వెంకటేశ్వర్లు(వింజమూరు సొసైటీ అధ్యక్షులు), మద్దసాని వెంకటేశ్వర్లు(జిల్లా పార్టీ అధికార ప్రతినిధి), శ్రీకుర్తి రవీంద్రబాబు(మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు) లాంటి వారి వకాల్తా పుచ్చుకుని మాట్లాడే స్థాయి నీకు లేదు. వారి అనుమతి లేకుండా వారి పేర్లు వాడే సాహసం చేశావు. కనుక నీ పై పార్టీ క్రమశిక్షణ చర్య తప్పదు. సిద్దంగా ఉండు. పార్టీ ద్వారా గుర్తింపు పొంది అదే పార్టీని పలుచన చేసే సంస్కృతి బీసీలకు లేదు. బీసీ నాయకుడంటే మిగిలిన సామాజిక వర్గాలకు సైతం ఆదర్శంగాఉండాలి, అలానే ఉన్నాం కూడా. పదవులు రాకపోతే పార్టీని బ్లాక్‌మెయిల్ చేస్తే పదవి వస్తుందనుకోవడం అమాయకత్వం. గ్రామ, మండల , పార్లమెంట్ రాష్ట్ర కమిటీలలో ఓసీ, బీసీ దళిత మైనార్టీ సామాజిక వర్గాల కూర్పుతో మునుపెన్నడూలేని విధంగా నియోజకవర్గంలోని దాదాపు ప్రతి గ్రామానికి తిరిగి పారదర్శకంగా క్యాడర్ అభిప్రాయములకు అనుగుణంగా పార్టీ పదవులు ఇచ్చిన ఘనత మన శాసనసభ్యులు కాకర్ల సురేష్‌ది. నియోజకవర్గంలో భారీ కార్యాలయంను ఏర్పాటు చేసి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్నీ సామాజిక వర్గాలను కలుపుకొని వెళ్తున్న సురేష్‌కి, నియోజకవర్గ అభవృద్దిని కాంక్షించే బీసీలుగా ఆయనకు వెన్ను దన్నుగా ఉంటాం. అందరి దృష్టి ఆకర్షిస్తూ గడిచిన 2 ఏళ్లలో వందల కోట్ల పనులతో అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్న ఉదయగిరి నియోజకవర్గం పరువును బజారు పాలు చేస్తే ఊరుకునేది లేదు. పార్టీని ఉపయోగించుకొని పార్టీ, బీసీల గౌరవాన్ని అప్రతిష్టపాలు చేసే నీలాంటి వాళ్ళకు, నీ వెనక ఉండి నడిపించే అగ్రవర్ణ అస్థిర కాముకులకు ఎలా బుద్ధి చెప్పాలో నియోజకవర్గంలోని నిజమైన తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులకు భాగా తెలుసునని హెచ్చరిస్తున్నాం.

పట్టా పొలంలో ప్రభుత్వ ఆంక్షలు

- న్యాయం చేయాలంటూ జెసికి వినతి



నెల్లూరు కలెక్టరేట్, మే 22, ప్రభాతవార్త పట్టా పొలంలో పంటలు సాగుచేసుకునేకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారని, రెవెన్యూ అధికారుల సైతం ఆంక్షలు పెడుతూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలువాయికి చెందిన దేవి రెడ్డి హైమావతి నరసింహారెడ్డి దంపతులు శుక్రవారం జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. అనంతసాగరం మండలం ముత్తుకూరులోని పొలాన్ని 2007లో ఉమ్మడి హైకోర్టు వేలంలో తాము పాడి పొందడం జరిగిందన్న వారు ఈ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం 1బి, అడంగల్ రికార్డులలో కూడా నమోదు చేసుకోవడం జరిగిందన్నారు. అన్నీ పక్కాగా ఉన్న తమ పొలాన్ని సర్వే చేసి సర్వే ప్రొసీడింగ్స్ కూడా ఇవ్వడం రిసర్వే కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. వేలం ద్వారా పొందిన ఆ భూమిలో పంటలు సాగుచేసుకోనీకుండా ముత్తుకూరుకు చెందిన కొందరు తమను ఇబ్బందులు పెడుతున్నారని ఊట చెరువు పొలం అంటూ తమను ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై ఆత్మకూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పర్మినెంట్ ఇంజక్షన్ ఆర్డర్ కూడా పొందామన్న దంపతులు పొలంలో ఎటువంటి ఆక్రమణలు జరగలేదని నలుగురు తహసిల్దారుల ప్రస్తుత ఆత్మకూరు ఆర్డీవో జిల్లా కలెక్టర్కు నివేదికలు పంపడం జరిగిందన్నారు. అయినప్పటికీ తమ పొలం విషయమై కొందరు హైకోర్టులో దాఖలు చేయడం జరిగిందన్నారు. అందులో తాము ప్రతివాదులు కానందున అనంతసాగరం తహసిల్దార్ అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉందన్నారు. రెవెన్యూ అధికారులు ఆ పని చేయకుండా తమ పొలంలో ఆంక్షలు పెడుతూ బోర్డులు పెడుతున్నారన్నారు. మిగిలిన సర్వే నెంబర్లు పొలం వదిలేసి ఇప్పటికీ తమ పొలంలో నాలుగు బోర్డులు పెట్టారన్న దేవి రెడ్డి హైమావతి నరసింహారెడ్డి దంపతులు దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తమ పొలంలో తాము పంటలు సాగు చేసుకునేలా చూడాలన్నారు.

మునిశేఖర్ రెడ్డికి కాకాణి నివాళి

నెల్లూరు, మే 22, ప్రభాతవార్త వైఎస్ఆర్ సీపీ పబ్లిసిటీ వింగ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వూరు మునిశేఖర్ రెడ్డి అకాల మరణం పట్ల మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. సూళ్లూ రుపేటలో మా జీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య , తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి , వైఎస్ఆర్ సీపీ స్టేట్ సెక్రటరీ పుట్టా శివశంకర్‌రెడ్డి తదితరులతో కలిసి మునిశేఖర్ రెడ్డి భౌతికకాయానికి వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ జెండాకప్పి, పూలమాలవేసి, ఘన నివా ళులర్పించారు మునిశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి,ధైర్యం చెప్పి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఇటువంటి పరిస్థితుల్లో ధైర్యంతో గుండె నిబ్బరంతో, ముందడుగు వేయా లని, మునిశేఖర్ రెడ్డి కుటుంబానికి మా అందరి ప్రార్ధనలు ఉంటాయని తెలియజేసిన కాకాణి జగన్మోహన్ రెడ్డికివీరాభిమాని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వరం లాంటి మునిశేఖర్‌ను కోల్పోవడం తట్టుకోలేకపోతున్నాం మునిశేఖర్ రెడ్డి అకాల మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైయస్సా ర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వైయ స్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ పబ్లిసిటీ వింగ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ సిద్ధాంతాలను, ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమైనది. ఆయనసేవలు పార్టీకి ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి.మునిశేఖ ర్‌రెడ్డి మరణం వైఎస్ఆర్ సీపీకి, వ్యక్తిగతంగా నాకు తీరని లోటు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక నమ్మకమైన సైనికుడిని కోల్పోయింది.ఈ కష్టసమయంలో వారి కుటుంబసభ్యులకు మరో సారి నా సానుభూతిని తెలియజేస్తూ, ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ తల్లి పల్లకీసేవ



బుచ్చి మే 22 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని దుర్గానగర్‌లో కొలువైవున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి సన్నిధిలోశుక్రవారం రాత్రి అమ్మవారి పల్లకీసేవ ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం పల్లకీసేవ ఉత్సవం వైభవంగా జరిగింది.ఈకార్యక్రమానికిఉభయకర్తలుగా తమ్మినేని మల్లికార్జున నాయుడు,ప్రమీలమ్మ, వారి కుటుంబసభ్యులు వ్యవహారించారు. గౌరవఅధ్యక్షులుగా పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు దంపతులు వ్యవ హారించారు. వ్యవస్థాపక ధర్మకర్తల మండలి అధ్యక్షులు కత్తుల చంగల్ రాయుడు దంపతులు ,కమీటి సభ్యులు వ్యవహారించారు. పల్లకీసేవ అనంతరం భక్తులకుతీర్ధ ప్రసాదాలు అందజేశారు.